ఆంధ్రజ్యోతి



5

జయశంకర్ భూపాలపల్లి
ములుగు
గురువారం 21 మార్చి 2024




రంజాన్ వేళలు
ఇఫ్తార్ : గురువారం సా : 6.33 గం.
సహర్ : శుక్రవారం ఉ : 4.57 గం.

చివరికి చేరేదెలా..?!

లక్నవరం ఆధునీకీకరణకు కలగని మోక్షం


లక్నవరం సరస్సు


తూముద్వారా వృథాగాపోతున్న నీరు (ఫైల్)

- లీకేజీలతో వృథాగా పోతున్న జలాలు
- పంట కాల్వలకు భారీగా గండ్లు
- ఏటా ఎండుతున్న చివరి ఆయకట్టు
- ఆమోదానికి నోచుకోని ప్రతిపాదనలు
- కొత్త ప్రభుత్వంపై రైతుల ఆశలు

లక్నవరం సరస్సు నిర్లక్ష్యానికి గురైంది. లీకేజీలమయంగా మారడంతో దీని ద్వారా చివరి ఆయకట్టుకు నీరందడం లేదు. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. తూముల మరమ్మతు, కాల్వల ఆధునీకీకరణ కోసం పాలకులు చర్యలు తీసుకోవడంలేదు. దీంతో ప్రతి ఏటా వరి పంటలు ఎండిపోతున్నాయి.

గోవిందరావుపేట, మార్చి 20 : కాకతీయుల ఏలుబడిలో నిర్మితమైన మండలంలోని లక్నవరం సరస్సు 5,555 హెక్టార్లలో విస్తరించి ఉంది. దీని నిర్మాణంలో కాకతీయులు ముందుచూపుతో వ్యవహరించారు. స్థానికంగా అనావృష్టి ఏర్పడినా ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు పోటెత్తే వరద లక్నవరం సరస్సులోకి చేరేలా ఏర్పాట్లు చేశారు. ఆయకట్టు మొత్తానికి నీటిని అందించేందుకు 80 కిలోమీటర్ల మేర ఐదు కాల్వలు (రంగాపూర్, కోట, శ్రీరాంపతి, నర్సింహులు-1, నర్సింహులు-2) నిర్మించారు. సరస్సు నీటి నిల్వ సామర్థ్యం 2.1 టీఎంసీలు కాగా ఆయకట్టులో అధికారికంగా 8,700 ఎకరాలు, అనధికారికంగా మరో 3 వేల ఎకరాల భూములు సాగవుతున్నాయి. అనాదిగా రైతులు ఇక్కడ వరిని సాగు చేసుకుంటున్నారు. ఖరీఫ్‌లో పూర్తి ఆయకట్టు సాగులోకి వస్తుంది. రబీలో మాత్రం సరస్సులో నీటిమట్టానికి అనుగుణంగా రొటేషన్ పద్ధతిలో తైబందీని ప్రకటిస్తారు.

శిథిలమైన తూములు .. కాల్వలకు బుంగలు

నైజాంపాలన కాలంలో చివరిసారిగా మరమ్మ తు జరిగిన లక్నవరం తూములు శిథిలమయ్యాయి. ఏటా వర్షాలు, వరదలకు కాల్వలు కూడా ఎక్కడిక క్కడ తెగిపోయాయి. చెరువులో పూడిక తీయకపో వడంతో సుమారు లక్ష క్యూబిక్ మీటర్ల మేర ఒండ్రుమట్టి పేరుకుపోయింది. కాల్వలు కూడా గడ్డి, పిచ్చి మొక్కలతో పూడుకుపోయాయి. తూముల నుంచి భారీగా నీరు బయటకొచ్చి సద్దిమడుగు గుండా కిందకు ప్రవహిస్తోంది. ఇలా ప్రతి పంటకాలంలోనూ 150 ఘనపుటడుగుల మేర నీరు వృథాగా పోతోంది. ఈ నీరు వెయ్యి ఎకరాలను సాగులోకి తెస్తుందని అంచనా. సరస్సు నీటిమట్టానికి అను గుణంగా ప్రకటించిన తైబందీ ప్రకారంగా రైతులు నాటు వేసుకుంటే లీకేజీలతో ముందే నీరు అడుగంటి చివరి ఆయకట్టుకు అందడంలేదు. దీంతో ప్రతిసారీ సుమారు వందెకరాల వరి పంట ఎండిపోతోంది.

పదేళ్లలో పట్టించుకోనేలేదు..

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత గడిచిన పదేళ్లలో లక్నవరం సరస్సును పట్టించుకోలేదు. మిషన్ కాకతీయ పథకంలో దీన్ని విస్మరించారు. తూము ల లీకేజీలు, కాల్వలకు గండ్లతో పంటలు ఎండిపో తున్న తీరు, పెరుగుతున్న నష్టం దృష్ట్యా రైతుల డిమాండ్ మేరకు నీటిపారుదల శాఖాధికారులు క్యాడ్‌వామ్ (సీఏడీడబ్ల్యూఎం) పథకంలో భాగంగా ఐదేళ్ల క్రితం రూ.20 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి సమర్పించారు. అయితే.. ఎలాంటి స్పందన కనిపించలేదు. తూములకు స్కిన్‌వాల్ నిర్మించడంతోపాటు పంట కాల్వల్లో 25 కిలోమీటర్ల మేర గైడ్‌వాల్, వరద కాల్వలకు మత్తళ్లు, డ్రెయినేజీ, కట్టల బలోపేతం, దుంపెల్లిగూడెం నుంచి బుస్సాపురం మీదుగా రంగాపూర్ వరకు పంటకాల్వ పొడవునా రోడ్డు నిర్మాణం కోసం ఆ ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. సరస్సు వద్ద నిత్యం పర్యవేక్షణ కోసం ఇరువురు లష్కర్లతోపాటు మరో ఇద్దరు వాచ్‌మన్లు, పంట కాల్వల వద్ద ఆరుగురు లష్కర్లను నియమించాలని కూడా ప్రతిపాదించారు. వేటికీ ఆమోదం లభించకపోవడంతో ఆయకట్టు రైతులు ఏటా ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ఈ పనులన్నీ చేయాలంటే అంచనా వ్యయం రూ.50 కోట్లు దాటనుంది. కొత్త ప్రభుత్వంలోనైనా లక్నవరం ఆధునీకీకరణకు మోక్షం లభిస్తుందని రైతులు ఆశపడు తున్నారు. ఇదిలా ఉండగా తూముల నుంచి విడు దల చేసిన నీటిని కాల్వ లకు మళ్లించేం దుకు సద్దిమడుగే ప్రధానం. బాలెన్స్ రిజర్వాయ ర్‌గా పనిచేసే ఈ సద్దిమడుగు కూడా శిథిలమై పోయింది. 5ఎంసీఎఫ్‌టీ నీటి నిల్వ సామర్థ్యం కలిగిన సద్దిమ డుగు కట్టను బలోపేతం చేయడంతోపాటు షెట్టర్లను నిర్మించాల్సి ఉంది.


కాల్వకు బుంగపడ్డ ప్రాంతంలో వేసిన ఇసుక బస్తాలు

'చిన్నకాళేశ్వరం' పనులు పూర్తి చేయాలి

వానాకాలం పంటకు సాగునీరందించాలి

అధికారులతో కలెక్టర్ భవేష్ మిశ్రా


కాటారంలో ఐబీ, రెవెన్యూ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ భవేష్ మిశ్రా

కాటారం, మార్చి 20: చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు పనులను త్వరితగతిన పూర్తి చేసి, దాని ద్వారా వానాకాలం పంటకు సాగునీరందించేందుకు చర్యలు చేపట్టాలని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులను కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశించారు. అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లుతో కలిసి కాటారం మండలంలో కలెక్టర్ బుధవారం పర్యటించారు. చిన్న కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా గారెపల్లి వద్ద నిర్మించిన స్టేజీ-2 పంప్‌హౌస్, గారెపల్లి నూతన చెరువు, విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను పరిశీలించారు. పంప్‌హౌస్‌లో మోటార్లను రన్ చేయడానికి చర్యలు చేపట్టాలన్నారు. 33/11కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు నిరంతరాయంగా నిర్వహించి త్వరితగతిన పూర్తి చేయాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. వేసవిలో పెండింగ్ పనులు పూర్తిచేసి గోదావరి నుంచి స్టేజీ-1, స్టేజీ-2 పంప్‌హౌస్‌ల ద్వారా నీటిని సరఫరా చేసి చెరువులను నింపి రాబోయే వానాకాలం పంటలకు సాగునీరందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాజెక్టు పూర్తయితే నాలుగు మండలాల పరిధిలోని 45వేల ఎకరాలకు సాగు నీరు అందుతుందన్నారు. గారెపల్లి నూతన చెరువును పరిశీలిస్తుండగా కొందరు భూనిర్వాసితులు కలెక్టర్‌కు తమ గోడు వినిపించారు. తమకు పదేళ్లుగా పరిహారం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ పెండింగ్ పరిహారంపై దృష్టిసారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో సమీక్ష చేశారు. పైప్‌లైన్లు, కాల్వల నిర్మాణానికి భూసేకరణ, నిధుల మంజూరుకు ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మంగీలాల్, తహసీల్దార్ నాగరాజు, ఐబీ డీఈఈలు ఉపేందర్, సూర్య, పరశురాం, ఏఈలు విజయ్‌కుమార్, వెంకన్న, తిరుపతి, ఆర్‌ఐ వెంకన్న, సర్వేయర్ వినయ్, నిర్మాణ సంస్థ మేఘ ప్రాజెక్ట్ మేనేజర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

మహదేవపూర్‌లో పర్యటన

మహదేవపూర్ : మండల కేంద్రంలో కలెక్టర్ భవేష్ మిశ్రా, అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు పర్యటించారు. చిన్న కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా చేపడుతున్న చెరువుల్లోకి నీటిని ఎత్తిపోతల పనులను పరిశీలించారు. మండల కేంద్రంలోని మందరం చెరువు, ఎర్రచెరువు స్థితిగతులను పరిశీలించారు. రెండు నెలల వ్యవధిలో ఆయా చెరువులకు నీరు చేరే విధంగా చర్యలు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆయా చెరువులను నింపితే ఏయే గ్రామాలకు సాగునీరు అందుతుందనే అంశంపై చర్చించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్వరితగతిన సాగునీరు అందేలా అధికారులు పనిచేయాలని సూచించారు. ఆయన వెంట ఇరిగేషన్ ఈఈ తిరుపతిరావు తదితరులు ఉన్నారు.

ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ మృతి


బోల్తాపడిన ట్రాక్టర్, యాకూబ్ పాషా మృతదేహం

మంగపేట, మార్చి 20: ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలో పొద్మూరుకాలనీకి చెందిన ఎం.డి.యాకూబ్ పాషా (40) కమలా పురం వాసి ఆకుల ప్రభాకర్‌కు చెందిన ట్రాక్టర్‌పై డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బుచ్చంపేట గ్రామ పంచాయతీ పరిధి జబ్బోనిగూడెం నెమళ్లగుట్ట ప్రాంతంలో క్వారీ నుంచి మొరం తరలిస్తుండగా రైతులు వేసుకున్న కాల్వగట్టుపై నుంచి ట్రాక్టర్ నడుపుతుండగా అది అదుపు తప్పింది. మల్లూరువాగు ప్రాజెక్టు కాల్వలో పల్టీ కొట్టిన ట్రాక్టర్ తలకిందులైంది. దాని కింద డ్రైవర్ యాకూబ్‌పాషా ఇరుక్కొని ప్రాణాలు వదిలాడు. స్థానికులు అక్కడికి చేరుకొని వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై రవికుమార్ సిబ్బంది సహాయంతో ఎక్సావేటర్ ద్వారా ట్రాక్టర్‌ను తొలగించి మృతదేహాన్ని వెలికి తీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏటూరునాగారం సామాజిక వైద్యశాలకు తరలించారు. మృతుడి భార్య రేష్మా, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం

కోటంచ ఆలయంలో భక్తుల సందడి


కల్యాణానికి హాజరైన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు దంతపలు

రేగొండ, మార్చి 20: మండలంలోని కోటంచ ఆలయంలో బుధవారం భక్తుల సందడి నెలకొంది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం కనులపండువగా జరిగింది. ఈ సందర్భంగా పూజారులు ధ్వజారోహణం చేశారు. అనంతరం స్వామివారిని అలంకరించి అశ్వవాహనంపై డప్పు చప్పుళ్లు, కోలాటాలు, గోవిందనామస్మరణం మధ్య పురవీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, పద్మ దంపతులు ఈ సందర్భంగా పట్టువస్త్రాలు, తాళిబొట్టు సమర్పించారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకీలో మండపానికి తీసుకొచ్చి పూజారులు కల్యాణం జరిపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాస్, జాతర కమిటీ చైర్మన్ ముల్కనూరి భిక్షపతి, డైరెక్టర్లు నబ్బిడి సమ్మిరెడ్డి, మూల ఓంకార్, కోటేశ్వరరావు, శ్రీధర్, పోలుసాని శ్రీనివాసరావు, సదరం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


అశ్వవాహనంపై స్వామి వారి శోభాయాత్ర

ఎన్నికల కోడ్‌కు విఘాతం కలగొద్దు

పోలీసు అధికారులతో ఎస్పీ కిరణ్ ఖరే



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కిరణ్‌ఖరే

కృష్ణకాలనీ (భూపాపల్లి), మార్చి 20: పార్లమెంట్ ఎన్నికల కోడ్‌కు విఘాత కలగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఎస్పీ కిరణ్‌ఖరే అన్నారు. భూపాలపల్లిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఆయన పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. పార్లమెంట్ ఎన్నికల ప్రశాంత నిర్వహణకు చేపట్టాల్సిన కార్యాచరణపై సమీక్షించారు. సమస్యాత్మక, సున్నితమైన పోలింగ్ కేంద్రాలపై దృష్టి సారించాలన్నారు. కాళేశ్వరం అంత రాష్ట్ర చెక్‌పోస్టుతో పాటు నాలుగు చెక్‌పోస్టులను ఏర్పాటుచేశామని, వాటిలో సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండేలా చర్యలు చేపట్టాలని అన్నారు. రాత్రి సమయాల్లో వాహనదారులకు కనిపించేలా రిఫ్లెక్టింగ్ జాకెట్లు ధరించి విధులు నిర్వర్తించాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడే సంఘ విద్రోహ వ్యక్తులపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. పార్లమెంట్ ఎన్నికలను పారదర్శకంగా, నిస్పక్షపాతంగా, సమర్థంతంగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో భూపాలపల్లి అదనపు ఎస్పీ (ఆపరేషన్) బుజంగరావు, కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, వర్టికల్ డీఎస్పీ నారాయణ నాయక్, జిల్లా పరిధిలోని సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరిట మోసం!

లబోదిబోమంటున్న నిరుద్యోగులు

ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల నిర్వాహకులపై కలెక్టరేట్‌లో ఫిర్యాదు

భూపాలపల్లి కలెక్టరేట్, మార్చి 20: ఉద్యోగాల పేరిట పలు ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు నిరుద్యోగులను దోచుకుంటున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. లక్షలు వసూలు చేస్తూ మోసం చేస్తున్నా పట్టించుకొనే నాథుడే కరువయ్యాడని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూపాలపల్లి జిల్లాలో రెండు ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల (రిజిస్టర్డ్) నిర్వాహకులు వంద పడకల ఆస్పత్రి, మెడికల్ కాలేజీ, సమీకృత కలెక్టరేట్‌లో ఉద్యోగావకాశం కల్పిస్తామని చెప్పి డబ్బులు వసూలు చేసి మోసం చేశారని బాధితులు లబోదిబోమంటున్నారు. దీనిపై కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేయగా ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పిన ఔట్ సోర్సింగ్ నిర్వాహకులు ముఖం చాటేశారని బాధితులు రజిత, అనూష, సంపత్, సుమతి, రాజేశ్వరి, మల్లేశ్వరి, మహేందర్, లక్ష్మీనారాయణ, తిరుపతి, రవీందర్, భద్రయ్య, సది, రాజు తదితరులు కలెక్టరేట్‌లో తమ ఆవేదనను వెల్లగక్కారు. తాము చెల్లించిన డబ్బులను తిరిగి ఇప్పించి న్యాయం చేయాలని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఉద్యోగం ఇప్పిస్తామని తమతో లావాదేవీలు చేసిన ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల నిర్వాహకుల ఆడియో వాయిస్ రికార్డులు తమ వద్ద ఉన్నాయని అంటున్నారు. ఉద్యోగావకాశం కల్పించే విషయంలో ఎమ్మెల్యే పేరును కూడా వారు వాడుకున్నారని చెబుతున్నారు. తమకు న్యాయం చేయాలని కలెక్టరేట్, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం చుట్టూ బాధితులు చక్కర్లు కొడుతున్నారు.

మోదీ చొరవతోనే వర్గీకరణ సాధ్యం

మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు అరూరి రమేశ్


బీజేపీలో చేరిన వారితో అరూరి రమేశ్, ధర్మారావు

హనుమకొండ టౌన్, మార్చి 20: ప్రధాని మోదీ చొరవతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమనే విషయాన్ని దళితులు గ్రహించాలని వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు అరూరి రమేశ్ అన్నారు. హనుమకొండ దీన్‌దయాళ్‌నగర్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆయన పార్టీ శ్రేణులతో బుధవారం సమావేశమయ్యారు. వర్ధన్నపేట, ఒంటిమామిడిపల్లి, ఐనవోలుకు చెందిన పార్టీ నాయకులు, మాజీ ఎంపీటీసీ పెండ్లి తిరుపతిరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ కొట్టం రాజుతోపాటు సుమారు 20 మంది అరూరి రమేశ్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. వారికి పార్టీ క్రమ శిక్షణ సంఘం చైర్మన్ మార్తినేని ధర్మారావు కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ పదేళ్లలో ఎలాంటి అవకతవకలు, అవినీతి లేని పాలనను మోదీ అందించిన విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు.

కాంగ్రెస్‌లా క్రిష్టియన్, మైనారిటీ, సి సర్టిఫికెట్ అంటూ బీజేపీ ఎలాంటి కిరికిరి పెట్టడంలేదని అన్నారు. మార్తినేని ధర్మారావు మాట్లాడుతూ దేశంలో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న 25 కోట్ల మందిని ఎగువనకు చేర్చిన ఘనత ప్రధాని మోదీ సొంతమన్నారు. దేశాన్ని పరిరక్షిస్తున్న మోదీ నాయకత్వాన్ని ప్రజలంతా కోరుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేటర్ గురుమూర్తి, రావు అమరేందర్‌రెడ్డి, గడిపల్లి రాజేశ్వర్, కేశవరెడ్డి, రంజిత్, మహేశ్వర్, రాంబాబు, వెంకట్‌రావు, జడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు, మజ్జిగ జైపాల్, రమేశ్‌గౌడ్, ఏకాంతం, షణ్ముఖరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌ను నిర్మూలించాలి

గ్రామీణాభివృద్ధి జిల్లా అధికారి శ్రీనివాస్


సదస్సులో మాట్లాడుతున్న గ్రామీణాభివృద్ధి జిల్లా అధికారి శ్రీనివాస్

ములుగు కలెక్టరేట్, మార్చి 20: ఎయిడ్స్ నిర్మూలనకు యువత పాటుపడాలని గ్రామీణాభివృద్ధి జిల్లా అధికారి ఆకవరం శ్రీనివాస్ కుమార్ అన్నారు. ములుగు లోని సఖి కేంద్రంలో బుధవారం నెహ్రూ యువకేంద్ర జిల్లా యువజన అధికారి చింతల అన్వేష్ అధ్యక్షతన ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా శ్రీనివాస్ కుమార్ హాజరయ్యారు. 15 నుంచి 29 సంవత్సరాల మధ్య వయసు ఉన్నవారే ఎక్కువగా ఎయిడ్స్ వ్యాధి బారిన పడుతున్నారన్నారు. ఎయిడ్స్ పట్ల యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎయిడ్స్, హెచ్ఐవీ వ్యాధిగ్రస్థుల పట్ల వివక్ష చూపకుండా మానవతా దృక్పథంతో చూడాలన్నారు. జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ కె.వసుధ మాట్లాడుతూ కళాశాల యువత చెడు వ్యసనాలకు, దురలవాట్లకు లోనుకాకుండా మంచి అలవాట్లు అలవర్చుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, పేయింటింగ్, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సదస్సులో జాతీయ యువజన అవార్డు గ్రహీత ఆకులపల్లి మధు, డీసీపీవో ఓంకార్, సిబ్బంది హరికృష్ణ, కృష్ణవేణి, జ్యోతి, రవీందర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

మృతదేహం లభ్యం

కాజీపేట, మార్చి 20: కాజీపేట రైల్వే స్టేషన్ సమీపంలో ఓ గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. కాజీపేట దర్గా రైల్వే ట్రాక్ సమీపంలో బుధవారం ఓ గుర్తు తెలియని మహిళ మృతి చెంది ఉంది. యాచకురాలు అనారోగ్యంతో మృతి చెందినట్లు తెలుస్తోంది. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఎంజీఎంలో భద్రపరిచామని, ఆచూకీ తెలిసిన వారు కాజీపేట రైల్వే పోలీస్ స్టేషన్ ఫోన్ నంబర్ 98661 67291 నంబర్‌కు సంప్రదించాలని రైల్వే పోలీసులు తెలిపారు.

జాతీయ సమైక్యతా శిబిరానికి కేయూ జట్టు ఎంపిక

కేయూ క్యాంపస్, మార్చి 20: ఈనెల 22 నుంచి 28 వరకు కర్ణాటక రాష్ట్రంలోని జనపదలోక రాంనగర్‌లో జరిగే జాతీయ సమైక్యతా శిబిరానికి కాకతీయ యూనివర్సిటీ జట్టును ఎంపిక చేసినట్లు కేయూ జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ సమన్వయ అధికారి ప్రొఫెసర్ ఈసం నారాయణ బుధవారం తెలిపారు. ఎంపికైన వారిలో టి.మనోజ (టీటీడబ్ల్యూఆర్‌డీసీ, మహబూబాబాద్), బి.హిందుప్రియా (ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల, ఖమ్మం), రోషిణి (కిట్స్ కళాశాల, హసన్‌పర్తి), పి.మనస్విత, (యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, సుబేదారి), జె.హర్షిత (యూనివర్సిటీ మహిళ ఇంజనీరింగ్ కళాశాల, కేయూ), సీహెచ్.శివశంకర్ (ఎల్‌బీ కళాశాల, వరంగల్), జి.రాజు (టీటీడబ్ల్యూఆర్‌డీసీ బాయ్స్, మణుగూరు.) బి. సూర్యకాంత్ (ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల, ఆదిలాబాద్), జె.మహేశ్(వాగ్దేవి డిగ్రీ అండ్ పీజీ కళాశాల, హనుమకొండ), జి.దిలీప్‌కుమార్(కేయూ ఇంజనీరింగ్ కళాశాల) ఉన్నారు. వీరికి హనుమకొండ ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రేణుకుంట్ల ప్రవీణ్‌కుమార్ కాంటింజెంట్ లీడర్‌గా వ్యవరిస్తారు. ఎంపికైన జట్టు సభ్యులను కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ఇతర అధికారులు అభినందించారు.



బాధితులతో మాట్లాడుతున్న ఏసీపీ

ఐదు తులాల గొలుసు అపహరణ

వరంగల్ క్రైం, మార్చి20: కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని విజయలక్ష్మీకాలనీలో మహిళ మెడలోని గొలుసును గుర్తుతెలియని యువకుడు లాక్కెళ్లాడు. కాలనీలో బందెల రమాదేవి అనే మహిళ కిరాణ షాపు నిర్వహిస్తోంది. మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి బైక్ మీద వచ్చి ఆలుగడ్డలు కావాలని బేరం చేస్తూనే ఒక్కసారిగా రమాదేవి మెడలోని ఐదు తులాల బంగారు గొలుసును లాక్కెళ్లాడు. పట్టుకునే ప్రయత్నం చేసినప్పటికీ హెల్మెట్‌తో ఉన్న యువకుడు బైక్ మీద పారిపోయాడు. సమాచారం అందుకున్న కేయూ సీఐ సంజీవ్, హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని బాధితురాలి నుంచి వివరాలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు కేయూ సీఐ సంజీవ్ తెలిపారు.

కమిషనరేట్‌కు ఐపీఎస్ అధికారి

వరంగల్ క్రైం, మార్చి20: గ్రేహౌండ్స్ విభాగంలో శిక్షణ పొందుతున్న 2020 బ్యాచ్ ఐపీఎస్ అంకిత్‌కుమార్‌ను వరంగల్ కమిషనరేట్‌కు అటాచ్ చేస్తూ బుధవారం డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు అంకిత్ కుమార్ వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అంకిత్‌కుమార్‌ను సీపీ అభినందించారు.



సీపీని కలిసిన అంకిత్‌కుమార్

15 ఏళ్లుగా..

ఐసెట్‌ను పకడ్బందీగా నిర్వహిస్తున్న కాకతీయ విశ్వవిద్యాలయం
ఉమ్మడి రాష్ట్రం నుంచి ప్రత్యేక రాష్ట్రం దాకా దక్కిన గౌరవం

కేయూ క్యాంపస్, మార్చి 20: రాష్ట్ర వ్యాప్తంగా ఎంబీఏ, ఎంసీఏ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఐసెట్-24 నిర్వహణ 15వ సారి కాకతీయ యూనివర్సిటీకే దక్కింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మొదలుకుని తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత వరుసగా ఈ ఏడాది 15వ దఫా ఐసెట్ నిర్వహణ కేయూకే దక్కడం గర్వకారణం. రాష్ట్ర ఉన్నత విద్య మండలి యేటా ప్రవేశ పరీక్షలను ఒక్కో వర్సిటీకి కేటాయిస్తుంటుంది. అయితే ఐసెట్ నిర్వహణను మాత్రం ఉమ్మడి ఏపీ నుంచి వరుసగా కాకతీయ యూనివర్సిటీకే అప్పగిస్తోంది. ఉమ్మడి రాష్ట్రంలో కేయూ వరుసగా 6దఫాలుగా ఐసెట్ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించింది. 2014 నుంచి ఇప్పటి వరకు కేయూనే వరుసగా పకడ్బందీగా నిర్వహిస్తోంది. వర్సిటీలో మొదటగా ప్రొఫెసర్ ఓంప్రకాశ్, శర్మ, ప్రొఫెసర్ చింతకింది రాజేశం, ప్రొఫెసర్ రాజిరెడ్డి, ప్రొఫెసర్ వరలక్ష్మిలు కన్వీనర్‌గా సమర్థవంతంగా పనిచేశారు. అదే క్రమంలో ప్రస్తుతం కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం సీనియర్ ప్రొఫసర్ శ్రీరామోజు నరసింహచారిని కన్వీనర్‌గా నియమించారు.

భారీగా పోటీ..

యేటా ఐసెట్ పరీక్షలు రాసే అభ్యర్థుల సంఖ్య పెరుగుతోంది. మేనేజ్‌మెంట్ రంగంలో దేశ, విదేశాల్లో ఉద్యోగ అవకాశాల వస్తుండటంతో బీటెక్ చేసిన అభ్యర్థులు సైతం ఎంబీఏ వైపు వస్తున్నారు. సగటున ఏడాదికి 70వేల మందికి పైనే అభ్యర్థులు పరీక్షలు రాస్తున్నారు. మార్కెటింగ్, ఫైనాన్స్ విభాగాల్లోనూ ఎంబీఏ అభ్యర్థులకు మంచి ఉద్యోగ అవకాశాలున్నాయి. స్కిల్ ఉన్న అభ్యర్థులను కార్పొరేట్ సంస్థలు భారీ ప్యాకేజీలతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నాయి.

ఏదైనా డిగ్రీ

గుర్తింపుపొందిన వర్సిటీ నుంచి బీఏ, బీకాం, బీఎస్సీ, ఇంజనీరింగ్‌తోపాటు ఏదైనా డిగ్రీ కోర్సు పాసైన అభ్యర్థులందరూ ఐసెట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం ఫైనలీయర్ చదవుతున్న అభ్యర్థులు సైతం ఐసెట్ పరీక్షలకు హాజరుకావచ్చు. ఐసెట్ పరీక్ష 200 మార్కులకు ఉంటుంటి. 75 మార్కుల చొప్పున ఎనలైటికల్ ఎబిలిటీ, మ్యాథ్స్ ఎబిలిటీ సిలబస్‌తోపాటు మరో 50 మార్కులకు జనరల్ ఇంగ్లీష్‌లో సిలబస్ రూపొందించారు. అత్యధిక స్కోరు సాధించిన అభ్యర్థులకు ఉస్మానియా, కేయూ, పాలమూరు. శాతవాహన, తెలంగాణ, మహాత్మాగాంధీతోపాటు ఇతర వర్సిటీల్లోనూ సీట్లు పొందే అవకాశం ఉంది.



ఐసెట్ నోటిఫికేషన్ విడుదల చేస్తున్న దృశ్యం (ఫైల్)

షెడ్యూల్ విడుదల

రాష్ట్ర వ్యాప్తంగా ఎంబీఏ, ఎంసీఏ కళాశాలల్లో 2023-24 ఏడాదికి ప్రవేశాల మార్చి 5న టీఎస్ఐసెట్-24 నోటిఫికేషన్ విడుదల అయింది. మార్చి 7 నుంచి ఏప్రిల్ 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తారు. మే 17 నుంచి 27 వరకు రూ. 250, రూ.500 అపరాధ రుసుంతో దరఖాస్తులను స్వీకరిస్తారు. జూన్ 4, 5వ తేదీల్లో కంప్యూటర్ బెస్డ్ పరీక్ష నిర్వహిస్తామని రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధికారులు ప్రకటించారు.

పకడ్బందీగా పరీక్షలు నిర్వహిస్తాం..

కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, ఐసెట్ చైర్మన్



వరుసగా కేయూకు 15వ దఫా ఐసెట్ నిర్వహణ బాధ్యతలు అప్పగించడం సంతోషంగా ఉంది. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా పకడ్బందీ పరీక్షలను నిర్వహిస్తాం. విద్యార్థులకు ఎల్లప్పుడూ సందేహాలను తీర్చేందుకు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటాం. తెలంగాణతో పాటు ఏపీలోనూ ఐసెట్ పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేస్తాం.

నేడు కేయూకు మాజీ డీజీపీ ఆదిత్య ఆర్య రాక

కేయూ క్యాంపస్, మార్చి 20: కేయూ సెనెట్‌హాల్‌లో గురువారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్ రామచంద్ర మిషన్ ఇన్స్టిట్యూట్ నేతృత్వంలో జరిగే ధ్యానం, రిలాక్సేషన్, స్వచ్ఛత, ఇతర విద్యార్థి ఉద్యోగార్థులకు ఉపయోగపడే అంశాలపై అవగాహన కల్పించేందుకు మాజీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) డాక్టర్ ఆదిత్య ఆర్య, యూఎస్ఏ నుంచి డాక్టర్ అరిహంత మాధవ మోహన్ హాజరుకానున్నట్లు కేయూ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి బుధవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి కేయూ వీసీ తాటికొండ రమేశ్ అధ్యక్షత వహిస్తారని వెల్లడించారు. వర్సిటీలోని బోధన, బోధనేతర సిబ్బందితోపాటు పరిశోధకులు, విద్యార్థులందరూ రావాలని కోరారు.

కుష్టువ్యాధి నిర్మూలనకు పాటుపడాలి

వరంగల్ మెడికల్, మార్చి 20: కుష్టువ్యాధి నివారణలో భాగంగా ఇంటింటికీ తిరుగుతూ అవగాహన కల్పిస్తున్నట్లు రాష్ట్ర లెప్రసీ ఎల్‌సీడీసీ కార్యక్రమల పరిశీలకుడు డాక్టర్ మైకేల్ తెలిపారు. బుధవారం హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఇంటింటి సర్వే చేపట్టారు. కుష్టువ్యాధి నివారణకు ఆశ కార్యకర్తల నుంచి అధికారుల వరకు అందరూ పాటుపడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా లెప్రసీ నిర్మూలన అధికారి, అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మదన్ మోహన్‌రావు, పాల్గొన్నారు.

ప్రపంచ కవితా దినోత్సవం

హనుమకొండ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ప్రపంచ కవితా దినోత్సవాన్ని పురస్కరించుకొని కవితా ఓ కవితా అన్న శీర్షికన ఆకాశవాణి వరంగల్ కేంద్రం గురువారం కవి సమ్మేళనం ప్రసారం చేయనున్నదని ఆకాశవాణి వరంగల్ కార్యక్రమం అధికారి ఇల్లెందుల రవికుమార్ తెలిపారు. అకాశవాణి వరంగల్ కేంద్ర ప్రాంగణంలో నిర్వహించే ఈ కవి సమ్మేళనంలో వల్లంపట్ల నాగేశ్వర్‌రావు, డాక్టర్ జరీనాబేగం, చేవూరి శ్రీ రామారావు, డాక్టర్ మంతెన శంకర్, పొట్లపల్లి శ్రీనివాసరావు, రమేశ్వర్ రాజు, బిల్ల మహేందర్ వనపర్తి పద్మావతి, హాజీ నురానీ కవితలను ముందుగానే రికార్డు చేశామని ఆయన తెలిపారు. ఈ కవిసమ్మేళనంలో గేయాలు, పద్యాలు, వచన కవితలు, మినీ కవితలు, మణిపూసలు ఇలా అన్ని ప్రక్రియలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశం

వరంగల్ కార్పొరేషన్, మార్చి 20: తెలంగాణ రాష్ట్రం భవన నిర్మాణ సంక్షేమ మండలి ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికుల పిల్లలకు, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు ఎన్‌ఏసీ ఇన్‌స్ట్రక్టర్ గోపాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 90 రోజుల శిక్షణలో ఎలక్ట్రీషియన్, హౌస్‌వైరింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. 10వ పాస్ అయి 18 నుంచి 30 యేళ్లలోపు వారై ఉండాలని సూచించారు. శిక్షణా కాలంలో ఉచిత యూనిఫామ్, ఉచిత మధ్యాహ్నం భోజనం అందిస్తామని తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన తర్వాత న్యాక్ సర్టిఫికెట్ అందించి ప్రైవేటు కంపెనీలలో ఉద్యోగ అవకాశం కల్పిస్తామన్నారు. వివరాలకు 7989247723, 9949684763 సెల్ నెంబర్‌లలో సంప్రదించాలని గోపాల్ సూచించారు.

కెనాల్‌లో పడిన వ్యక్తి
కాపాడిన ఇద్దరు యువకులు

వరంగల్ క్రైం, మార్చి20: కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చింతగట్టు క్యాంపు వద్ద కుమార్‌పల్లికి చెందిన యువకుడు బుధవారం మధ్యాహ్నం కెనాల్‌లో పడిపోయాడు. అటుగా వెళుతున్న లక్ష్మణ్, సాయి అనే ఇద్దరు యువకులు కెనాల్‌లో దూకి యువకుడిని కాపాడారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు యువకుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. యువకుడిని కాపాడిన లక్ష్మణ్, సాయిలను ఎస్ఐ రాజ్‌కుమార్ అభినందించారు.



యువకుడిని కాపాడుతున్న స్థానికులు

పకడ్బందీగా పోలీసుల నిఘా, తనిఖీలు

వరంగల్ కమిషనరేట్ పరిధిలో 24 చెక్ పోస్టులు ● లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఏర్పాటు

వరంగల్ క్రైం, మార్చి20: మే మాసంలో జరిగే లోక్‌సభ ఎన్నికలకు పోలీసు భద్రతను పటిష్టం చేశారు. వరంగల్ కమిషనరేట్ పరిధిలో 24 చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు విస్మరించి డబ్బు, నగలు, మద్యం సరఫరాను చెక్ పోస్టులతో నియంత్రించనున్నారు. నిబంధనలను విస్మరించి ఆధారాలు లేకుండా రూ.50వేలకు మించి తరలిస్తే స్వాధీనం చేసుకోనున్నారు. వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా నిరంతరం చెక్ పోస్టుల తనిఖీలను పర్యవేక్షిస్తున్నారు.

చెక్ పోస్టుల వివరాలు

- వరంగల్ జిల్లా పరిధిలో నర్సంపేట నియోజకవర్గంలో అయ్యప్ప గుడి నర్సంపేట, బోలోన్‌పల్లి (నల్లబెల్లి), అశోక్‌నగర్ (ఖానాపురం)
- తూర్పు నియోజకవర్గంలో ఎంజీఎం సర్కిల్, నాయుడు పెట్రోల్‌పంపు, జాన్‌పాక్ లేబర్‌కాలనీ.
- వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలో అనంతసాగర్ (హసన్‌పర్తి), డీసీ తండా, చింత నెక్కొండ.
- వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో కాజీపేట డీజిల్ కాలనీ, ఐశ్వర్య గార్డెన్ (ములుగు రోడ్), సీఎస్ఆర్ గార్డెన్ (హంటర్‌రోడ్డు).
- పరకాల నియోజకవర్గంలో కటాక్షపూర్ క్రాస్‌రోడ్డు, కొమ్మాల, నడికూడ.
- హుస్నాబాద్ నియోజకవర్గం పెంచికలపేట (ఎల్కతుర్తి).
- జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ పరిధిలో జీడికల్ (లింగాలఘణపురం), నల్లబండ (జఫర్‌గడ్), రాంపూర్ (ధర్మసాగర్).
- పాలకుర్తి నియోజకవర్గం మొద్రాయి (దేవరుప్పుల), కిష్టాపూర్ క్రాస్‌రోడ్డు (రాయపర్తి).
- జనగామ నియోజకవర్గం పెంబర్తి (జనగామ), ఇన్యానాయక్ తండా (తరిగొప్పుల), కొన్నె క్రాస్‌రోడ్ (బచ్చన్నపేట).

మతాన్ని ప్రోత్సహించే ఎన్ఈపీ విద్యా విధానాన్ని రద్దు చేయాలి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి

కేయూ క్యాంపస్, మార్చి 20: మతాన్ని ప్రోత్సహిస్తూ, మనుషుల్లో తారమత్యాలను తేచ్చే నూతన జాతీయ విద్యా విధానాన్ని వెంటనే రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి డిమాండ్ చేశారు. బుధవారం కేయూ దూరవిద్యకేంద్రంలోని ప్రొఫెసర్ జాఫర్ నిజాం సెమినార్ హాల్‌లో ఎస్ఎఫ్ఐ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్ఎల్ మూర్తి హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెచ్చిన అన్‌సైటింఫిక్ ఎన్ఈపీ-2020ని రద్దు చేయాలని అన్నారు. విద్యాసంస్థల్లో మతాన్ని ప్రవేశపెట్టే విధానాలను కేంద్రం మానుకోవాలని డిమాండ్ చేశారు. బడా పెట్టుబడిదారులకు కంపెనీ జీతగాళ్లుగా తయారు చేసే విధానాన్ని రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ పోరాడుతోందని అన్నారు. వర్సిటీల స్వయంపతిపత్తిని కాపాడాలని అన్నారు.

ఎస్ఎఫ్ఐ కేయూ కమిటీ ఎన్నిక

కాకతీయ యూనివర్సిటీ ఎస్ఎఫ్ఐ నూతన కమిటీని 17 మందితో నియమించగా అధ్యక్ష, కార్యదర్శులుగా సాయికిరణ్, స్టాలిల్‌లు ఎంపికయ్యారు. అలాగే ఉపాధ్యక్షులుగా పరిమిళ, అరుణ్, సహాయకార్యదర్శిగా అనూష, జస్వంత్, ట్రెజరర్‌గా అభిరామ్, కమిటీ సభ్యులుగా వరుణ్‌తేజ్, సాయి ప్రసన్న, సందీప్, తేజస్విని, సాయితేజ, పవన్‌లను ఎన్నుకున్నారు. అనంతరం మహాసభ నూతనంగా ఎన్నికైన కమిటీ పలు తీర్మానాలను ఆమోదించింది. వర్సిటీల స్వయం పతిపత్తిని కాపాడాలని, కేయూ అభివృద్ధికి రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని, వర్సిటీల్లో ఖాళీగా బోధన, బోధనేతర సిబ్బందిని నియమించాలని తీర్మానాల్లో కోరారు. ఎస్ఎఫ్‌సీ కోర్సులను రెగ్యులర్ చేయాలని, సరైన అర్హతలున్న వారినే వీసీలుగా నియమించాలని, రాజకీయ ప్రాబల్యం వద్దని కోరారు. పెంచిన వర్సిటీల్లోని ఫీజులను తగ్గించాలని, కేయూ మహిళ ఇంజనీరింగ్ విద్యార్థులకు వసతి సౌకర్యం కల్పించాలని కోరారు. నూతన కమిటీకి ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్, వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ, కేయూ అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్ అభినందించారు. వివిధ డిపార్టుమెంట్‌ల విద్యార్థులు పాల్గొన్నారు.



ఎస్ఎఫ్ఐ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎల్ మూర్తి

నగరంలో హంగులతో కూడిన క్రికెట్ స్టేడియం

హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు

వరంగల్ స్పోర్ట్స్, మార్చి 20: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో వరంగల్ నగరంలో ఉప్పల్ స్టేడియం తరహాలో అన్ని హంగులతో కూడిన రంజీ మ్యాచ్‌లు ఆడే వసతుల కలిగిన నూతన క్రికెట్ స్టేడియం నిర్మాణానికి కృషి చేస్తానని హెచ్‌సీఏ, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.జగన్‌మోహన్‌రావు తెలిపారు. బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని ఓ హోటల్‌లో వరంగల్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి జగన్‌మోహన్‌రావు ముఖ్య అతిథిగా హాజరై ఉమ్మడి వరంగల్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ప్రకటించారు.

అనంతరం జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ.. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అంటే ఒక్క హైదరాబాద్ ప్రాంతానికే పరిమితం కాదని, రాష్ట్రంలో ఉన్న 10 జిల్లాల సొత్తు అని పేర్కొన్నారు. హెచ్‌సీఏ ఆధ్వర్యంలో ప్రతీ జిల్లాలో క్రికెట్ స్టేడియం నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. క్రికెట్‌ను మారుమూల ప్రాంతాలకు విస్తరించేలా హెచ్‌సీఏ ఆధ్వర్యంలో ప్రతిభ గల క్రీడాకారులకు సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. త్వరలోనే వరంగల్ నగరంలో క్రికెట్ వేసవి శిక్షణా శిబిరం నిర్వహిస్తామని, ఇందులో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను హెచ్‌సీఏ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో శిక్షణ ఇస్తామన్నారు. వరంగల్‌లో క్రికెట్ క్లబ్ ఏర్పాటుకు జిల్లాలోని వివిధ క్రీడాసంఘాల బాధ్యులు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. హనుమకొండ జేఎన్ఎస్‌లో ఉన్న హ్యాండ్‌బాల్ అకాడమీని ఎట్టి పరిస్థితుల్లో తరలించకూడదని కోరారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ప్రకటించారు. ఈసమావేశంలో ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అజీజ్‌ఖాన్, భైరబోయిన కైలాస్ యాదవ్, తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి చాగంటి శ్రీనివాస్, అంతర్జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ క్రీడాకారుడు పోగుల అశోక్, అథ్లెటిక్స్ అసోసియేషన్ బాధ్యులు సారంగపాణి, మైన్ విద్యాసంస్థల చైర్మన్ మూగల కుమార్‌యాదవ్, కబడ్డీ అసోసియేషన్ బాధ్యులు సారంగపాణితో పాటు వివిధ క్రీడా సంఘాల బాధ్యులు, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



వరంగల్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గంతో జగన్‌మోహన్‌రావు

హ్యాండ్‌బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

ఉమ్మడి వరంగల్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ చైర్మన్‌గా బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, అధ్యక్షుడిగా డాక్టర్ ఇండ్ల నాగేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా బొడ్డు విష్ణు, కోశాధికారిగా బి. నరేందర్‌బాబు, ఉపాధ్యక్షులుగా పోగుల అశోక్, ఎస్. రాజ్‌కుమార్, సంయుక్త కార్యదర్శి బి. అశోక్, ఈసీ సభ్యులుగా సంతోష్, శ్రీధర్, వీరస్వామి, శ్రీను, కిరణ్, నాగరాజులను ఏకగ్రీవంగా నియమితులయ్యారు.

పారిశ్రామిక శిక్షణ సంస్థలకు మహర్దశ

అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ ట్రైనింగ్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ కానున్న ఐటీఐలు

కాటారం, మార్చి 20: జిల్లాలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)లకు మహర్దశ పట్టనుంది. ప్రస్తుత ఉద్యోగ, ఉపాధి అవసరాలకు అనుగుణంగా యువతకు స్కిల్స్, నూతన ట్రేడ్స్, షార్ట్ టర్మ్ కోర్సులను ప్రవేశపెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీని కార్యాచరణ ప్రకటించింది. డిమాండ్ ఉన్న కోర్సులను ప్రవేశపెట్టి విద్యార్థులకు ఉపాధి కల్పించడానికి ఇటీవల ప్రభుత్వం ఐటీఐలను అప్‌గ్రేడ్ చేసింది. వందల కోట్ల రూపాయలను సైతం వెచ్చించడానికి ముందుకొచ్చింది. ఈ క్రమంలో కాటారం ఐటీఐతో పాటు భూపాలపల్లి ఐటీఐకి మంచి రోజులు రానున్నాయి.

ప్రభుత్వ ఐటీఐలు, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ కళాశాలల్లో సాంకేతిక విద్యనభ్యసించే ప్రతి విద్యార్థికీ గ్యారెంటీగా ఉపాధి లభించేలా సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికను అమలు చేయడానికి చర్యలు చేపట్టింది. ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) పద్ధతిలో ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ ట్రైనింగ్ సెంటర్(ఏటీటీసీ)గా అప్‌గ్రేడ్ చేయడానికి నిర్ణయించింది. రాష్ట్రంలోని 65 ఐటీఐలను ఆధునాతన సాంకేతిక నైపుణ్య శిక్షణా కేంద్రాలుగా మార్చడానికి టాటా టెక్నాలజీ లిమిటెడ్(టీటీఎల్) సంస్థతో ఒప్పందం కుదుర్చుకోగా అందులో జిల్లాలోని కాటారం, భూపాలపల్లి ఐటీఐ సైతం ఉన్నాయి.

నైపుణ్య శిక్షణ కేంద్రాలుగా..

కాటారం ఐటీఐతో పాటు భూపాలపల్లి ఐటీఐలో సైతం ఆధునాతన నైపుణ్య శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం టాటా టెక్నాలజీ లిమిటెడ్ సంస్థతో 65 ఐటీఐలను అభివృద్ధి చేయడానికి ఒప్పందం కుదుర్చుకుని ఒక్కో దానికి రూ.35.75 కోట్ల చొప్పున నిధులు వెచ్చించేలా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా కాటారం ఐటీఐకి ఇటీవల రూ.4కోట్ల మంజూరయ్యాయి. ప్రభుత్వ ఐటీఐల్లో ఆధునాతన వర్క్ షాపులు నిర్మించేలా టీఎస్ఐఐఈకి పనులు అప్పగించింది.



-అందుబాటులోకి రానున్న కోర్సులు

ప్రభుత్వ ఐటీఐల్లో నైపుణ్యాభివృద్ధి కోసం టాటా టెక్నాలజీ లిమిటెడ్ సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకోవడంతో వచ్చే విద్యాసంవత్సరం నుంచి నూతన అడ్వాన్స్‌డ్ కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. డిజిటల్ టెక్నాలజీ పరిశ్రమలు 4.0 రంగంలో నేషనల్ కౌన్సిల్ ఫర్ ఒకేషనల్ ట్రైనింగ్ (ఎన్‌సీవీటీ) ఆమోదించిన ఆరు లాంగ్ టర్మ్ ట్రేడ్స్, 23షార్ట్ టర్మ్ కోర్సులు ప్రవేశపెట్టనున్నారు. టీటీఎల్ సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల కింద ఐటీఐలను ఆధునీకరించాలని నిర్ణయించింది. ఇప్పటికే తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల్లో టీటీఎల్ ప్రవేశపెట్టిన నూతన కోర్సులతో సత్ఫలితాలు వస్తుండటంతో సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు దావోస్‌లో ఆ సంస్థ ప్రతినిధులతో సమావేశం కాగా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఎంవోయూ కుదుర్చుకుంది.

రానున్న కోర్సులివే..

వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రభుత్వ ఐటీఐలు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ ట్రైనింగ్ సెంటర్స్‌గా అప్‌గ్రేడ్ అవుతుండటంతో నూతన లాంగ్ టర్మ్ ట్రేడ్స్, షార్ట్ టర్మ్ కోర్సులు విద్యార్థులకు అందుబాటులోకి రానున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన భూమి, భవనాలు సమకూర్చి విద్యుత్ సరఫరాను అందించనుండగా ఐదేళ్లపాటు టీటీఎల్ నూతన కోర్సులను నడిపించనుంది. డ్రోన్ల నిర్వహణ, ఎలక్ట్రిక్ వాహనాలు, భారీ వాహనాల మెకానిక్, ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానంలో ఉపయోగపడే టెక్నీషియన్లు, మొబైల్, వైద్య రంగాల్లో ఆధునిక మిషన్ల టెక్నీషియన్ కోర్సులను ప్రవేశపెట్టడానికి టీటీఎల్ సమాయత్తం తోంది. 6 లాంగ్ టర్మ్ ట్రేడ్స్‌లో 1. బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైయర్ (మెకానికల్) 2.అడ్వాన్స్ సీఎన్‌సీ మిషన్ టెక్నీషియన్ 3.మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్ 4.మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్, ఆటోమేషన్ 5. ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చ రింగ్ 6.ఆర్టిజన్స్ యూజింగ్ అడ్వాన్స్ టూల్స్ ఉండనున్నాయి. ఎలక్ట్రికల్ వెహికల్ మెయింటెనెన్స్, రోబోటిక్, ఆటోమేషన్, సీఏడీ/సీఏఎం సీఎంసీ మెషిన్, అడ్వాన్స్ మ్యానుఫ్యాక్చరింగ్ అండ్ అడ్వాన్స్ ప్లంబింగ్, స్మార్ట్ హెల్త్‌కేర్, స్మార్ట్ అగ్రికల్చర్, స్మార్ట్ సిటీ, సాఫ్ట్‌వేర్ టెస్టింగ్ అసిస్టెంట్, సోలార్ టెక్నీషియన్, మల్టీమీడియా యానిమేషన్ వంటి 23 షార్ట్ టర్మ్ కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. దీంతో అరకొర వసతులు, కాలంచెల్లిన కోర్సులతో కునారిల్లుతున్న జిల్లాలోని కాటారం, భూపాలపల్లి ఐటీఐలకు మహర్దశ పట్టనుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఆస్తిపన్ను సకాలం చెల్లించాలి

మునిసిపల్ చైర్‌పర్సన్ వెంకటరాణి

భూపాలపల్లిటౌన్, మార్చి 20: భూపాలపల్లి పట్టణ వాసులు ఆస్తి పన్ను వంద శాతం చెల్లించి అభివృద్ధికి సహకరించాలని మునిసిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. మొండి బకాయిదారులు వెంటనే చెల్లించి ప్రభుత్వం ఇచ్చిన 90శాతం వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈనెల 31 లోగా పన్ను చెల్లించిన వారికి మాత్రమే వడ్డీపై 90శాతం రాయితీ ఉంటుందని పేర్కొన్నారు.

లక్నవరం ఎకోపార్కును సందర్శించిన ట్రెయినీ ఎఫ్‌బీవోలు



ఎకోపార్కులో ట్రెయినీ ఎఫ్‌బీవోలు, అధికారులు

గోవిందరావుపేట, మార్చి 20: మండలంలోని లక్నవరం ఎకోపార్కును 34వ బ్యాచ్‌కు చెందిన ట్రెయినీ ఫారెస్టు బీట్ ఆఫీసర్లు బుధవారం డీఎఫ్ గంగారెడ్డి ఆధ్వర్యంలో సందర్శించారు. ఈసందర్భంగా ఎఫ్‌బీవోలు లక్నవరం బీట్‌లో సుమారు ఎనిమిది కిలోమీటర్లు ట్రెక్కింగ్ నిర్వహించి క్లీన్‌అండ్‌గ్రీన్ కార్యక్రమం చేపట్టారు. అనంతరం ములుగు ఎఫ్‌డీవో జోగేందర్, పస్రా ఎఫ్ఆర్వో మాధవిశీతల్ ట్రెయినీ ఎఫ్‌బీవోలకు ఎకోపార్కు కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లు వేణుగోపాల్, దీప్‌లాల్, అర్జున్‌తోపాటు ట్రెయినీ ఎఫ్‌బీవోలు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అండగా ఉంటా

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సింహరావు

ములుగు కలెక్టరేట్, మార్చి 20: క్రీడాకారులకు అండగా ఉంటానని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహరావు అన్నారు. ములుగులో బుధవారం ఎంపీపీ గండ్రకోట శ్రీదేవి సుధీర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. క్రీడాకారులకు క్రికెట్ కిట్లు, టీషర్టులను అందజేశారు. ఈసందర్భంగా లక్ష్మీనర్సింహారావు మాట్లాడుతూ యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రికెట్‌లో ప్రతిభ కనబరిచినవారికి సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. క్రీడాకారులకు క్రికెట్ కిట్లు అందించడం పట్ల ఎంపీపీ శ్రీదేవి- సుధీర్‌ను ఆయన అభినందించారు. బీఆర్ఎస్ నాయకులు పోరిక గోవింద్‌నాయక్, ప్రదీప్‌రావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు ప్రణాళికలు రూపొందించాలి

ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి

వెంకటాపురం(నూగూరు), మార్చి 20: మండలంలో తాగునీటి ఎద్దడి నివారణకు అధికారులు ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం జరిగిన మండల అధికారుల సమావేశంలో ఆమె అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ నీటి సరఫరాలో సమయపాలన పాటించాలని, మంచినీటి సరఫరాపై నివేదికలు అందించాలన్నారు. తాగునీటి వృధాను అరికట్టాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రతి ఇంటికీ నీటిని సమృద్ధిగా అంచాలన్నారు. నీటి వృధాను అరికట్టేందుకు వాల్వ్ సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో పరిశీలించాలని సూచించారు. ప్రజలు అధికారులకు కాల్ చేస్తే తక్షణమే స్పందించాలని, మంచినీటి వినియోగం, నీటి సంరక్షణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కొందరు ఎక్కువ నీరు వినియోగించడం వల్ల నీటి వృథా కావడంతోపాటు భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయని, ఇందుకోసం నియం త్రణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. కొన్ని ఇళ్లకు ఎక్కువ నీరు, కొన్ని ఇళ్లకు తక్కువ నీరు రావడం వల్ల సమస్యలు వస్తాయని, ఆ సమస్యను పరిష్కరించాలన్నారు. మంచి నీటి సరఫరాలో లైన్ ఆపరేటర్లు అలసత్వం వహిస్తే ఉపేక్షిం చేదిలేదని, తాగునీటి సరఫరాలో మూడు నెలలు అప్రమత్తంగా ఉండాలని ఆమె ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ సీఈ శ్రీనివాసరావు, ఎస్ఈ మాణిక్యరావు, ఎస్పీడీసీఎల్ డీఈ నాగేశ్వర్‌రావు, మండల స్పెషలాఫీసర్ రాంపతి, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, తహసీల్దార్ వీరభద్రప్రసాద్, మండల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

సింగరేణి సీఎండీకి రైతుల వినతి

కాకతీయఖని, మార్చి 20: సింగరేణి సీఎండీ బలరాంనాయక్‌ను భూపాలపల్లి మునిసిపల్ పరిధి ఆకుదారివాడ, ఫక్కీర్‌గడ్డ రైతులు హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో బుధవారం కలిశారు. ఓపెన్‌కాస్ట్ బ్లాస్టింగ్‌తో తమ ఇళ్ల గోడలు బీటలు వారుతున్నాయని, దుమ్ముధూళి వ్యాపించడంతో రోగాల బారిన పడుతున్నామని తెలిపారు. తమను గని పరిసర ప్రాంతం నుంచి తరలించాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రమేష్, రాజయ్య, హతీరాం, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



సింగరేణి సీఎండీకి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

తాగునీరు సరఫరా చేయాలని నిరసన

కాకతీయఖని, మార్చి 20: సింగరేణి సంస్థ తమకు తాగునీరు అందించాలని భూపాలపల్లి పట్టణంలోని కృష్ణకాలనీ, యాదవకాలనీ వాసులు డిమాండ్ చేశారు. ఏరియా జీఎం కార్యాలయం ఎదుట బుధవారం నిరసన తెలిపారు. మిషన్ భగీరథ నీటిలో పురుగులు వస్తున్నాయన్నారు. మురుగు నీరు సరఫరా కావడంతో అనారోగ్య బారినపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి అధికారులు చొరవ చూపి పూర్తిస్థాయిలో తాగునీరు అందిచాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏరియా జీఎం శ్రీనివాసరావుకు వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు మౌనిక, లక్ష్మి, శైలజ, సునీత, నిర్మల, హేమ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కాలనీ వాసులు

గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

చిట్యాల, మార్చి 20: పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ శ్రీదేవి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో టీకా కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా పాడి రైతులకు పలు సూచనలు ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఏడీ వెంకన్న, చల్లగరిగ పశు వైద్యాధికారి మహతి, సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలి

చిట్యాల, మార్చి 20: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని జడ్పీ సీఈవో విజయలక్ష్మి, డీడబ్ల్యూవో నాగేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని జూకల్లులో అంగన్‌వాడీల ఆధ్వర్యంలో బుధవారం పోషణ పక్వాడా కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పోషణ పంచ సూత్రాలు, హ్యాండ్ వాష్, శానిటేషన్, డయేరియా, రక్తహీనత నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బలవర్ధక ఆహారాన్ని అందిస్తోందని, చిన్నారులు, గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎక్కువ పోషకాలు కలిగిన రాగులు, సజ్జలు, సాధులు, కొర్రలు, జొన్నలు, కరివేపాకు చిరుధాన్యాల ఉపయోగాలపై వివరించారు. గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అక్షరభ్యాసం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో రామయ్య, తహసీల్దార్ మొహియొద్దీన్, హెచ్ఎం కృష్ణ, సూపర్‌వైజర్ జయప్రద, మెడికల్ ఆఫీసర్ నవత, పంచాయతీ కార్యదర్శి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



జూకల్లులో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో విజయలక్ష్మి

నేడు శ్రీభూనీల సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం

కాటారం, మార్చి 20: మండలంలోని ఒడిపిలవంచ గ్రామంలో శ్రీ భూనీలసమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం గురువారం జరుగుతుందని ఆలయ కమిటీ ప్రతినిధులు బుధవారం తెలిపారు. కర్రు నాగయ్య-కృష్ణకుమారి దంపతుల ద్వారా నిర్మితమైన ఆలయంలో ఉత్సవమూర్తుల ఊరేగింపు అనంతరం వేదపం డితులతో కల్యాణం వైభవంగా నిర్వహించ నున్నట్లు పేర్కొన్నారు. కల్యాణ మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్ల కృపకు పాత్రులై తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని కోరారు.



వేంకటేశ్వరస్వామి మూల విరాట్

మంత్రి శ్రీధర్‌బాబు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం



శ్రీధర్‌బాబు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

మల్హర్, మార్చి 20 : మండలంలోని వల్లెంకుంట గ్రామానికి చెందిన, డీసీసీ అధ్యక్షుడు అయిత ప్రకాశ్‌రెడ్డిని రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించడం పట్ల రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఫ్లెక్సీకి బుధవారం క్షీరాభిషేకం చేశారు. మండలంలోని కొయ్యూర్, వల్లెంకుంట గ్రామాలకు చెందిన రెడ్డి గాండ్ల సంఘం ఆధ్వర్యంలో వల్లెంకుంటలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. రెడ్డి గాండ్ల సంఘం అధ్యక్షుడు బొమ్మ తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్షుడు కుంభం బాపురెడ్డి, ప్రధాన కార్యదర్శి సంతోషం శ్రీనివాస్, కోశాధికారి అయిత స్వామి, గౌరవ అధ్యక్షుడు అయిత రాఘవరెడ్డి, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

మేడారం, మార్చి 20 : తాడ్వాయి మండలం నార్లాపూర్‌లో పోలీసులు బుధవారం వాహనాలను తనిఖీ చేశారు. కాటారం నుంచి కాల్వపల్లి రహదారి, భూపాలపల్లి నుంచి నార్లాపూర్ రహదారిపై వాహనాలను ఎస్సై శ్రీకాంత్ రెడ్డి నేతృత్వంలో సోదాలు చేశారు. తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధి కోసమే ఆరోపణలు : జడ్పీటీసీ

చిట్యాల, మార్చి 20: రాజకీయ లబ్ధి కోసమే తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని జడ్పీటీసీ గొర్రె సాగర్ అన్నారు. మండలంలోని చైన్‌పాకలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డబుల్ బెడ్‌రూం లబ్ధిదారులతో కలిసి ఆయన మాట్లాడారు. గ్రామంలో డబుల్ బెడ్‌రూం పథకంలో లబ్ధిదారుల నుంచి డబ్బులు తీసుకున్నట్లు ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియాలో ప్రచారం చేయడం తగదన్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో గ్రామానికి మంజూరైన 20 ఇళ్లకు శంకుస్థాపన చేశామన్నారు. రూ. 5 లక్షలతో ఇళ్ల నిర్మాణం పూర్తి కాదంటూ కాంట్రాక్టర్ పనులు నిలిపివేశాడని తెలిపారు. దీంతో లబ్ధిదారులం దరూ సమావేశమై తనను ఆహ్వానించారని, ఇళ్ల నిర్మాణ పనులకు రూ. లక్ష చొప్పున సమకూర్చుతామని ఒప్పందం చేసుకున్నట్లు పేర్కొన్నారు.. ఇళ్ల నిర్మాణాలకు ఇప్పటికే సుమారు రూ. 50లక్షల ఖర్చు అయిందని, ప్రస్తుత ఎమ్మెల్యే సత్యనారాయణరావు, కలెక్టర్ స్పందించి లబ్ధిదారులకు, కాంట్రాక్టర్‌కు న్యాయం చేయాలని కోరారు. తనపై అసత్య ఆరోపణలు చేసిన, ప్రచారం చేసిన వారిపై న్యాయపరమైన చర్యలకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈసమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ క్రాంతికుమార్‌రెడ్డి, ఎంపీటీసీలు భూక్య సుజాత రాజు, తిరుపతి, నాయకులు మహిపాల్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, మహేందర్, వెంకటేశ్వర్లు, పిట్ట సురేష్, శ్రీనివాస్ నాయక్, దేవేందర్, తిరుపతి, శశిధర్‌రెడ్డి, దామెర రాజు తదితరులు పాల్గొన్నారు.

యాసంగిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

కాటారం, మార్చి 20: మండలంలో ప్రస్తుతం యాసంగి వరి పంటలో పలు తెగుళ్లు, రోగాలను గుర్తించినట్లు వ్యవసాయ శాఖ మండల అధికారి గిరి రామకృష్ణ అన్నారు. రైతులు వెంటనే తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. మండలంలోని బొప్పారం, దంతెలపల్లి, ఆదివారంపేట, దేవరాంపల్లి గ్రామాల పరిధిలో వరి పొలాలను క్షేత్రస్థాయిలో బుధవారం పరిశీలించారు. వరిలో కాండం తొలిచే పురుగు(మొగి పురుగు), కాండంకుళ్లు, అగ్గితెగులు లక్షణాలను గమనించినట్లు తెలిపారు. మొగిపురుగు నివారణకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఎకరాకు 10 కిలోలు లేదా క్లోరాంథనిలిప్రోల్ గుళికలను 4 కిలోల చొప్పున వేసుకోవాలన్నారు. ద్రావణ రూపంలో అయితే ఇదే మందును ఎకరానికి 60 మి.లీ లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 400 గ్రాములు ఎకరానికి పిచికారీ చేయాలన్నారు. కాండం కుళ్లు నివారణకు హెగ్జాకోనాజోల్ 400 మి.లీ లేదా ప్రొపికొనజోల్ 200 మి.లీ ఎకరాకు పిచికారీ చేయాలన్నారు. మొక్కల ఆకుల మీద కాలిన మచ్చల లాగా ఏర్పడి క్రమేణా పెద్దవిగా మారితే అగ్గి తెగులుగా గుర్తించి నివారణకు ట్రైసైక్లోజోల్ 120 గ్రాములు ఎకరానికి పిచికారీ చేయాలన్నారు. ఆయన వెంట ఏఈవోలు రాజన్న, సరిత, దీపక్, దివ్య ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరగాలి

అదనపు కలెక్టర్ మహేందర్‌జీ

వెంకటాపూర్(రామప్ప), మార్చి 20: ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు సహకరించాలని అదనపు కలెక్టర్ సి.హెచ్.మహేందర్‌జీ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఐదు పోలింగ్ కేంద్రాలను ఆయన బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద బారికేడ్లు, టెంట్లు ఏర్పాటు చేయాలని, తాగునీటి వసతి కల్పించాలని, ఓటింగ్‌కు వచ్చే వారి వాహనాల పార్కింగ్‌కు తగిన ఏర్పాట్లు చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. మండల వ్యాప్తంగా 40 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. అంతకుముందు ఆయన తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ సదానందం, డిప్యూటీ తహసీల్దార్ కిషోర్, ఎంపీడీవో రాజు, పంచాయతీ సెక్రటరీ దామోదర్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఆదిమానవుల సమాధులను సందర్శించిన విద్యార్థులు

తాడ్వాయి, మార్చి 20: మండలంలోని దామెరవాయి గ్రామ సమీపంలోని సూరగుండయ్య గుట్టపై ఉన్న ఆదిమానవుల సమాధులను బుధవారం భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రిన్సిపాల్ జాన్‌మిల్టన్ ఆధ్వర్యంలో బొటానికల్, సైంటిఫిక్ ఫీల్డ్ ట్రిప్‌లో భాగంగా సందర్శించారు. ఈసందర్భంగా గ్రామ యువకుడు కార్తీక్ ఆదిమానవుల సమాధులు, సూరగుండయ్యగుట్ట చరిత్రను వారికి వివరించారు. సమాధులను త్వరగా అభివృద్ధి చేస్తే చరిత్రను కాపాడడంతోపాటు ముందుతరాలకు అందించవచ్చని కళాశాల అధ్యాపకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శ్యాంప్రసాద్‌రెడ్డి, సమీరా, శ్రీను, గ్రామస్థులు మహేష్, శ్రీహరి, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆదిమానవుల సమాధులను పరిశీలిస్తున్న విద్యార్థులు

మావోయిస్టులకు సహకరించొద్దు : సీఐ

గోవిందరావుపేట, మార్చి 20: గొత్తికోయగూడాలు, గ్రామాల్లోకి వచ్చే మావోయిస్టులకు సహకరించొద్దని పస్రా సీఐ శంకర్ సూచించారు. కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన ఎస్సై కమలాకర్, పోలీస్ సిబ్బందితో కలిసి పస్రా పరిధిలోని పందిరిదోన గొత్తికోయగూడాన్ని సందర్శించారు. ఈసందర్భంగా గొత్తికోయవాసులను సమావేశపరిచి మాట్లాడారు. అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం కల్పించొద్దని, గూడెంలోకి కొత్త వ్యక్తులు వచ్చినట్లయితే పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం గూడెంవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సివిల్, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు

వెంకటాపురం(నూగూరు), మార్చి 20: మండలంలోని బెస్తగూడెం గ్రామ సమీపంలోని గోదావరి పరీవాహక ప్రాంతంలోని వ్యవసాయ భూముల్లో నిర్వహిస్తున్న గుడుంబా స్థావరాలపై పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై అశోక్ మాట్లాడుతూ గోదావరి పరీవాహక ప్రాంతంలోని మిర్చితోట సమీపంలో కొందరు గుడుంబా తయారు చేస్తున్నారనే సమాచారంతో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈదాడుల్లో 1,600 లీటర్ల బెల్లం పానకాన్ని యువత సహాయంతో ధ్వంసం చేయడంతోపాటు 18 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నామని అన్నారు. గుడుంబా క్యాన్‌తో పారిపోతున్న బెస్తగూడెం గ్రామానికి చెందిన రాజును పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా గుడుంబా తయారీ కాని, విక్రయాలు కాని జరిపినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈదాడుల్లో సివిల్, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీవోపై డీఎల్పీవో విచారణ

మొగుళ్లపల్లి, మార్చి 20: మొగుళ్లపల్లి మండల పంచాయతీ అధికారి వీరస్వామిపై డీఎల్పీవో వీరభద్రయ్య బుధవారం విచారణ చేపట్టారు. కొన్నిరోజుల క్రితం మండలంలోని పలు గ్రామాలకు చెందిన మహిళా కార్యదర్శుల పట్ల ఎంపీవో అసభ్యంగా ప్రవర్తించారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో పంచాయతీ కార్యదర్శులు ఈనెల 7న జిల్లా పంచాయతీ అధికారితోపాటు కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు డీఎల్పీవో వీరభద్రయ్య విచారణ చేపట్టి వివరాలు తెలుసుకున్నారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

మంగపేట, మార్చి 20: మండలంలోని కమలాపురం బిల్ట్ కాలనీలో వెలిసియున్న శ్రీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో కల్యాణ మహోత్సవం బుధవారం కనులపండువగా జరిగింది. ఉత్సవ మూర్తులకు ప్రధానార్చకుడు ప్రతాపురం శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు కల్యాణ క్రతువును వైభవంగా నిర్వహించారు. ఈ ఘట్టాన్ని తిలకించేందుకు సుమారు 2 వేల మంది భక్తులు, బిల్ట్ కార్మికులు హాజరయ్యారు. ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో అర్చకులు ప్రతాపురం వంశీకృష్ణాచార్యులు, కలకోట రామాచార్యులు, కాటూరి రామచంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.



స్వామి వారి కల్యాణంలో భక్తులు